[redacted]

బ్యాంకువడ్డీ అన్నీ కలిపి పదిహేను లక్షల పైన వస్తుంది. ఐదు లక్షలు ధర్మారావు గారికి లక్షన్నర జాగాలు దొరకని వారికి రిటర్న్ చేస్తే మన ఖర్చులు పోను ఖచ్చితంగా ఏడెనిమిది లక్షలు మిగులుతుంది. పావలా వాటా నీది. అర్థమైందా- వెధవ వేషాలు వెయ్యకు. నేను ఆ జాగా మీ సొసైటీకి పన్నెండు లక్షలకి అమ్ముతున్నట్టు వచ్చేవారం పురోణీ రాయించి మెంబర్ల దగ్గర మిగతా బాలన్సు మూడువేలు కలక్ట్ చెయ్యి...."

"నీ బుర్ర జీనియస్ గురూ...నన్ను మాత్రం కౌన్సిలర్‌ని చేయాలి."

"అలాగే!"

* * *

అలా పావలా వాటా సుమారు రెండు లక్షలు ఆర్జించిన అప్పారావు తర్వాత ఎలక్షన్లలో ఆ పెట్టుబడితో కౌన్సిలర్ అయ్యాడు. ముప్పావలా వాటా ఆర్జించిన పానకాలరావు మినిస్టర్ అయ్యాడు. మూడువందల చదర గజాలు నాల్గువేల ఐదు వందల రూపాయలకు భస్మాసుర కోపరేటివ్ సొసైటీలో జాగాలు కొన్న మూడు వందలమంది ఆ జాగా లాండ్ సీలింగ్‌లో పోవడంవల్ల ప్రభుత్వంవారి నుంచి ఒక్కొక్కరు సుమారు ఐదువందల రూపాయలు నష్టపరిహారం పొందేరు.

---




ఎంబ్రాయిడరీ పని చేసే ఏబులమ్మకు, అరవై ఏళ్ళ వయసులో అయిదు లక్షలు అస్సాం లాటరీ వచ్చింది! ఏబులమ్మకు ఎప్పటినుంచో ఒక తీరని కోరిక వుంది. పింక్ కలర్ పియట్ కారులో భర్తతో పిక్‌నిక్‌కు వెళ్ళాలని. అయితే అస్సాం లాటరీ పుణ్యమా అని అయిదు లక్షలు వచ్చాయి కాని డ్రైవింగ్ రాదుగదా! అందుకని ఆట్టే ట్రాఫిక్ వుండని రోడ్లమీద అర్ధరాత్రి డ్రైవింగ్ నేర్చుకోవటం ప్రారంభించింది. పదిరోజులు తిప్పలుపడి చివరికి, డ్రైవింగ్ ఆయువుపట్లన్నీ పట్టింది. డ్రైవింగ్ లైసెన్సు సంపాదించింది!

ఓ శుభముహూర్తాన మెయిన్‌రోడ్డుమీద ఆమె ప్లిమత్ దూసుకు పోతోంది. అయితే ఎర్ర సిగ్నల్ లైటు వెలుగుతుంటే ఆగాలని, ఆకుపచ్చలైటు వెలిగితేనే ముందుకు పోవాలని ఏబులమ్మకు గుర్తుంది. కాని కర్మవశాత్తు దూరపుచూపు ఆనని దృష్టిలోపం వుండటంతో, ఎర్రలైటు వెలుగుతున్నా ముప్ఫయిమైళ్ళ వేగంతో ముందుకు దూసుకు పోయింది.

ఏబులమ్మ వాళ్ళలాంటి వాళ్ళ కోసం ఎదురుచూస్తున్న కానిస్టేబుల్ కమలాపతి ఏబులమ్మ మీద కేసుపెట్టి బోను ఎక్కించాడు.

అయితే ఏబులమ్మ యీ సంఘటనకు భయపడలేదు. దర్జాగా బోనెక్కి మేజిస్ట్రేట్ ముందు "అయ్యా! కమలాపతి అనే యీ కానిస్టేబుల్ అన్యాయంగా నామీద కేసు బనాయించాడు. ఈ మధ్య మహిళలపట్ల పోలీసులు ఎంత ఘోరంగా ప్రవర్తిస్తున్నారో మీకు తెలియందికాదు. నాకు చూపు ఆనదని, డేంజర్‌లైట్ వెలుగుతున్నా నేను దృష్టిదోషంవల్లనో, ఉద్దేశపూర్వకంగానో చట్టోల్లంఘన చేశానని ఇతని ఆరోపణ! నిజం చెప్పాలంటే ఆరోజు ఎర్రలైట్ వెలుగుతున్నా చూసుకోకుండా ట్రాఫిక్ రూల్స్‌కి వ్యతిరేకంగా కారు నడిపింది నేను కాదు! అది మరెవరిదో ప్లిమత్ కారు. ఈ కానిస్టేబుల్‌కే దృష్టిదోషముంది. ఇతను మరెవరి ప్లిమత్ కారునో నా ప్లిమత్‌కారుగా పొరపడ్డాడు!" అంది, వాగ్ధాటితో అదరగొడుతూ.

మేజిస్ట్రేట్ ఓ క్షణం ఆలోచించి "కానిస్టేబుల్‌కి దృష్టి దోషం వుందని ఆరోపించారు! బాగానే వుంది! అయితే ఈ ఆరోపణ నిజమని రుజువు చేయగలరా?" అన్నాడు.

"ఆహా! మీరు అవకాశం, అనుమతీయిచ్చేట్లయితే ఒక్కక్షణంలో ఆ పని ముగిస్తాను!" అంది ఏబులమ్మ. మేజిస్ట్రేట్ సమ్మతించిన వెంటనే ఏబులమ్మ కానిస్టేబుల్ కమలాపతి. మేజిస్ట్రేట్ చూస్తుండగా ఒక సూది తీసి పదిసార్లు సన్నటి దారాన్ని సూది కన్నులోకి ఎక్కించితీసి "చూశారుగా! దీన్నిబట్టి నాకు దృష్టి లోపం లేదని తెలుస్తూనే వుందిగా!" అంది.

మేజిస్ట్రేట్ నోరు తెరచి చూస్తుండగా, "ఇప్పుడు నేను పదిసార్లు అవలీలగా చేసిన పని యీ కానిస్టేబుల్ ఒక్కసారి చేయగలిగితే మీరు ఏ శిక్ష విధించినా పడతాను!" అంది ఏబులమ్మ సవాల్ విసురుతున్నట్టు.

మేజిస్ట్రేట్ కానిస్టేబుల్ కమలాపతిని ఏబులమ్మలా సూదిలోకి దారం ఎక్కించమన్నాడు.

పదిసార్లు ప్రయత్నించినా కమలాపతి ఒక్కసారీ సూదిలోకి దారం ఎక్కించలేకపోయాడు.

"అరవయ్యోపడిలోవున్న నాకున్నపాటి దృష్టి దారుఢ్యం, యువకుడైన ఈ కానిస్టేబుల్‌కు లేకపోయింది. ఇక న్యాయం మేజిస్ట్రేట్‌గారే దయచేయాలి!" అంది ఏబులమ్మ.

మేజిస్ట్రేట్ కేసు కొట్టివేస్తూ, కమలాపతికి కళ్ళజోడు రికమండ్ చేశాడు. ఏబులమ్మ వృత్తేమిటో ఆయనకు తెలియదు!

ఎమ్. డి. సౌజన్య